క్లుప్తంగా

రెండు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం


పోలీస్ స్టేషన్ వద్ద నిలిపి ఉంచిన ఇసుక ట్రాక్టర్

వేటపాలెం: అక్రమంగా ఇసుక లోడుతో పందిళ్ల పల్లి నుంచి తిమ్మసముద్రం వైపు వెళ్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. అక్రమంగా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నేడు అద్దంకిలో హనిమిరెడ్డి పర్యటన

అద్దంకి రూరల్: అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి ఆదివారం అద్దంకి నియోజవకర్గంలో పర్యటించనున్నట్లు పార్టీ కార్యాలయం నుంచి శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. మధ్యాహ్నం 12.30 గంటలకు అద్దంకి మండలంలోని శంకవరప్పాడు గ్రామంలో వివాహానికి హాజరవుతారని తెలిపారు. అలాగే రాత్రి 7.30 గంటలకు కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామంలో పలువురి వివాహ వేడుకల్లో పాల్గొంటారని ప్రకటనలో తెలిపారు.

రేపు చినగంజాంలో శ్రీనివాస కళ్యాణం

చినగంజాం: స్థానిక భావన్నారాయణ స్వామి ఆలయంలో 19వ తేదీ సోమవారం వెంకటేశ్వర స్వామి జన్మనక్షత్రం శ్రవణం సందర్భంగా శ్రీనివాస కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు జీ పిచ్చయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో సోమవారం రాత్రి 7 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి భక్తులందరూ విచ్చేసి తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆయన కోరారు.

వాకింగ్ చేస్తున్న వ్యక్తిని ఢీకొట్టిన బైకు


అద్దంకి రూరల్: సాయంత్రం వాకింగ్ చేస్తున్న వ్యక్తిని బైకు ఢీకొట్టింది. ఈఘటన శనివారం సాయంత్రం మండలంలోని బొమ్మనంపాడు గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. మారెళ్ల గ్రామంలోని ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న మాల్యాద్రి అద్దంకిలోని కలవకూరు రోడ్డులోని అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. శనివారం సాయంత్రం సమీపంలోని బొమ్మనంపాడు రోడ్డులో వాకింగ్ చేస్తున్నాడు. అటువైపుగా గ్రామంలోని బైకుమీద వెళ్తున్న వ్యక్తి మాల్యాద్రిని ఢీకొట్టాడు. ఇరువురు కిందపడటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఇద్దరిని ఒంగోలుకు తరలించారు.

ఆడపిల్లల చదువుతో ఇంట్లో వెలుగులు


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సునీత

స్వర్ణ (కారంచేడు): సమాజంలో చిన్న పిల్లలైన ఆడపిల్లలకు రక్షణ కల్పించాలని, అలాగే వారికి మంచి చదువును చెప్పించాలని ఐసీడీఎస్ స్వర్ణ సెక్టార్ సూపర్‌వైజర్ సునీత అన్నారు. శనివారం ఆమె మండలంలోని స్వర్ణ గ్రామంలో ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల వద్ద ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాల్లో బాలికలకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. 'బేటీ బచావో-బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలోని ఆడబిడ్డలను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఇంటికి దీపం ఇల్లాలు అన్నట్లుగా చిన్నతనం నుంచే ఆడపిల్లలకు మంచి చదువు చెప్పించాలన్నారు. వారి ద్వారా వారి కుటుంబంలో ఎంతో వెలుగులు నింపుతారన్నారు. కార్యక్రమంలో ఆమా పాఠశాలల ఉపాధ్యాయులు, శ్రీలక్ష్మి, రాధా, శ్రీదేవి, శివ, అనిత విద్యార్థినులు పాల్గొన్నారు.

పర్చూరులో మూడు వేల మొక్కలు పంపిణీ


మొక్కలను పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

పర్చూరు (చినగంజాం): వాయిస్ ఆఫ్ పర్చూరు ఆధ్వర్యంలో శనివారం పర్చూరులో మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కడియం నుంచి తెప్పించిన మామిడి, సపోట, కొబ్బరి, దానిమ్మ, యూకలిప్టస్ తదితర రకాలకు చెందిన మూడు వేల మొక్కలు ఉచితంగా పంపిణీ చేసినట్లు సంస్థ ప్రతినిధి లంకా భరత్ తెలిపారు. గ్రీన్ పర్చూరు లక్ష్యంతో గత 14 సంవత్సరాలుగా అందరికి మొక్కలు ఉచితంగా అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. మొక్కలు తీసుకెళ్లినవారు వాటి సంరక్షణ బాధ్యతని కూడా చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారుడు లంకా ప్రసాద్, తులసి శివనాగేశ్వరరావు, నలతోటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



అద్దంకిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



చీరాలలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది


కారంచేడులో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్న డాక్టర్లు

- కోల్‌కతాలో వైద్యురాలి హత్యకు నిరసనగా ధర్నా, మానవహారాలు
- ఓపీలు బంద్ చేసిన వైద్యులు

దేశంలో వైద్యులకు రక్షణ కరువు

చీరాల: దేశంలో వైద్యులకు రక్షణ కరువైంది.. ప్రాణాలు పోసే డాక్టర్ల ప్రాణాలను తీయడం అమానుషమని, వారికి రక్షణ కల్పించాలని వైద్యులు, సిబ్బంది డిమాండ్ చేశారు. ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎ.భవాని ప్రసాద్, ఐఎంఏ చీరాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పి.శ్రీదేవి, పి.శ్రీకాంత్‌లు ఆధ్వర్యంలో నివారం ర్యాలీ చేపట్టారు. స్థానిక ఐఎంఏ హాలు నుంచి గడియార స్తంభం సెంటర్ వరకు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన ర్యాలీ చేశారు. అనంతరం గడియార స్తంభం సెంటర్‌లో మానవహారం, ధర్నా కార్యక్రమాలు చేపట్టారు. చీరాల ప్రాంతంలో ఉన్న వైద్యులు 24 గంటల పాటు ఓపీలు నిలిపివేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో డాక్టర్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. వైద్యవృత్తిలో భద్రత ఉంటుందని, వారి కుటుంబాలు ఖర్చులకు వెనుకడుగు వేయకుండా వైద్య కళాశాలలకు పంపుతున్నారన్నారు. కాని ప్రస్తుతం దేశంలో వైద్యులకు పూర్తిగా రక్షణ కరువైందన్నారు. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా అవి అమలుకు నోచుకోవడంలేదని నిరసన వ్యక్తం చేశారు. కోల్‌కతా ప్రభుత్వ వైద్య కళాశాల హాస్పిటల్‌లో ఈనెల 9న రాత్రి డ్యూటీలో ఉన్న మహిళా డాక్టర్‌గా అమానుషంగా అత్యాచారం చేశారన్నారు. ఈ దారుణానికి పాల్పడిన సైకోలను ఉరి తీయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి వైద్యురాలి విషయంలో సత్వర న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తాము విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమానికి వైద్యులకు ల్యాబ్ అసోసియేషన్ సంఘం మద్దతు తెలిపింది.

ప్రాణాలు కాపాడుతున్న దాక్టర్లకే రక్షణ కరువు..

మార్టూరు/కారంచేడు: ప్రాణాపాయంలో ఆసుపత్రికి వచ్చే వారిని ఎంతో శ్రద్ధగా వారి ప్రాణాలు కాపాడే వైద్యులకు నేడు రక్షణ లేకుండా పోయిందని కారంచేడు, స్వర్ణ పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ కే జెస్సీరాణి, డాక్టర్ షాలినీలు అన్నారు. ఐఎంఏ పిలుపు మేరకు మండలంలోని కారంచేడు, స్వర్ణ పీహెచ్‌సీల వద్ద వైద్యులు, వైద్య సిబ్బంది నిరసనలు తెలిపారు. ఇటీవల కోల్‌కతాలో జరిగిన ఘటనను వారు గుర్తు చేశారు. మొదటి పీహెచ్‌సీల నుంచి గ్రామంలో ర్యాలీలు నిర్వహించి మానవాహారంగా ఏర్పడి నిందితులను కఠినంగా శిక్షించాలని, మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా కఠినమైన చట్టాలను తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ హస్మప్రియ, హెచ్‌వీ వీరమ్మ, జగదీశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశలు, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


అద్దంకిలో మానవహారంగా ఏర్పడిన వైద్యులు

■ మార్టూరులో ప్రభుత్వ ఆసుపత్రి వైద్య, ఆరోగ్య సిబ్బంది నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రజల ప్రాణాలను కాపాడుతున్న వైద్యులు ఇతర సిబ్బందిపై నానాటికి పెరిగిపోతున్న అరాచకాలు అక్రమాలకు వ్యతిరేకంగా విధులను బహిష్కరించి జాతీయ రహదారిపై ప్లకార్డులు చేతబూని నినాదాలు చేశారు. అనంతరం స్థానిక స్టేట్‌బ్యాంక్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన ప్రదర్శన నిర్వహించారు.

వైద్యురాలిపై హత్యాచారం అమానుషం..

అద్దంకి: వైద్య సేవలు అందిస్తున్న వైద్యురాలిపై హత్యాచారం చేయడం అమానుషమని సీహెచ్‌సీ వైద్యాధికారి జీ శరత్‌కుమార్ అన్నారు. వైద్యాధికారి డీ శరత్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. దీనిలో భాగంగా వైద్యశాల నుంచి ప్రారంభించిన ర్యాలీ భవానీ సెంటర్, బస్టాండు సెంటర్లలో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ కోల్‌కతా లోని వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న మహిళా వైద్యురాలిపై జరిగిన హత్యాచారానికి వ్యతిరేకంగా దేశంలో ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, హత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈర్యాలీ మోదేపల్లి, మేదరమెట్ల, కొరిశపాడు, ప్రాసంగులపాడు వైద్యశాలల్లోని వైద్యులు సూపర్‌వైజర్లు, సీహెచ్‌సీ నర్సింగ్ విభాగం, పారామెడికల్ సిబ్బంది, వైద్యులు పీ వెంకట్, కే వాహిలా చౌదరి, జీ ప్రదీప్తి, జీ మెర్సి, జయసింహా, బాలరాజు, అక్షిత, డాక్టర్ మాధురి, ప్రతీష్‌కుమార్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చినగంజాం: వైద్యురాలిపై జరిగిన హత్యాచారాలకు నిరసనగా చినగంజాంలో వైద్యులు, సిబ్బంది నల్ల రిబ్బన్‌లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఎస్ విజయభాస్కర్, సాయిశ్రీ చరణ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


మార్టూరు బ్యాంకు సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు, సిబ్బంది


చినవంతెన సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడిన వైద్య సిబ్బంది


చినగంజాంలో నిరసన చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

బెట్ట తీవ్రతను అధిగమిస్తే దిగుబడులు

మార్టూరు: ప్రస్తుత అనావృష్టి పరిస్థితుల్లో పత్తిలో బెట్టను సమర్థవంతంగా ఎదుర్కొంటే అధిక దిగుబడులు సాధించవచ్చని మార్టూరు ఏడీఏ కేవీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రాజుపాలెం గ్రామంలో శనివారం సాయంత్రం ఏవో కిరణ్‌కుమార్‌తో కలిసి పత్తి పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ పత్తి పంటలో ప్రస్తుతం ఉన్న బెట్ట వాతావరణ పరిస్థితుల వలన రసం పీల్చే పురుగులు, పచ్చదోమ, తెల్లదోమ, పేనుబంక, ఎర్రనల్లి పంటపై దాడి చేస్తున్నాయన్నారు. వీటి నివారణకు పంట దశ 20, 40, 60 రోజుల కాలంలో ఉన్నప్పుడు 4:1 నిష్పత్తిలో మోనోక్రోటోఫాస్, నీటిని కలిపి కుంచెతో కాండం ప్రాంతంలో పూయాలి. లేదా ఇమిడాక్లోప్రిడ్‌ను నీటితో కలిపి 20:1 నిష్పత్తిలో కుంచెతో కాండం సమీపంలో పూయాలన్నారు. అలాగే గులాబీ రంగు పురుగు వలన నష్టం ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున ఎకరాకు 4 నుంచి 6 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏవో రాధాకృష్ణ, స్థానిక రైతులు పాల్గొన్నారు.


పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు

ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటుపై పరిశీలన

చీరాల: ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు చేసే విధానంపై శనివారం మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి ప్రతి ఇంటిని సందర్శించి నీటి కుళాయి కనెక్షన్ ఉన్నదా లేదా అని పరిశీలించారు. వాటర్ సప్లై గ్యాప్ ఎనాలసిస్ యాప్‌లో నమోదు చేయుటకు వార్డు ఎమినిటీ సెక్రటరీలకు లాగిన్ ఇచ్చారు. యాప్‌లో వివరాలు నమోదు చేయాలని ఆయన ఆదేశించారు. పేరాల మసీదు సెంటర్‌లో ఆయన తనిఖీ చేశారు. ఇంటి యజమానులకు, వార్డు ప్రజలను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎమినిటీ సెక్రటరీలు, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు ఉన్నారు. అలానే పాపరాజుతోటలోని అన్నా క్యాంటీన్‌లో ఉదయం టిఫిన్ సరఫరా సమయంలో ఆయన పరిశీలన చేసి అక్కడ వసతులను పరిశీలించారు.


యాప్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి

ఎస్సీ వర్గీకరణ తీర్పు సహేతుకం కాదు

చీరాల రూరల్: ఎస్సీ వర్గీకరణను రాష్ట్రాలు చేపట్టవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం సహేతుకం కాదని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ తీర్పును నిరసిస్తూ ఈనెల 21న భారత్ బంద్ విజయవంతం చేయాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం స్థానిక ఆంబేడ్కర్ భవన్‌లో నాయకులు కరపత్రాలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా నాయకులు కంచర్ల చిట్టిబాబు, గోసాల సుధాకర్, కట్టా ఆనంద్‌బాబు, వాసిమళ్ల రత్నబాబు, యాతం మేరిబాబులు మాట్లాడారు. ఆర్టికల్ 341 ప్రకారం ఇదే సుప్రీంకోర్టు గతంలో ఎస్సీ వర్గీకరణ చెల్లదని తీర్పునిచ్చిన విషయాన్ని వారు గుర్తు చేశారు. ఒక కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వచ్చినా మిగతావారికి రిజర్వేషన్ వర్తించదని సుప్రీంకోర్టు దానిని క్రిమిలేయర్‌గా పరిగణించడాన్ని వారు తప్పుపట్టారు. దేశ అత్యున్నమైన సుప్రీం కోర్టులో ఒక వర్గం న్యాయమూర్తులు అధికంగా ఉన్నారని వారికి వర్తించని క్రిమిలేయర్ పద్ధతి కేవలం ఎస్సీలకు మాత్రమే వర్తించేలా తీర్పులు ఎలా ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విధానం వలన ఒక్క మాలలకే కాకుండా మాదిగలకు కూడా వర్తిస్తుందని చెప్పారు. తీర్పును నిరసిస్తూ తలపెట్టిన భారత్ బంద్‌లో మాలలు, అంబేడ్కరిస్టులు, మేధావులు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

బొబ్బేపల్లిలో రక్షాబంధన్ వేడుకలు


సోదరులకు రాఖీలు కడుతున్న అక్కా చెల్లెళ్లు

మార్టూరు: ఈనెల 19వ తేదీ సోమవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా మండలంలోని బబ్బేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు రాఖీలను స్వయంగా తయారు చేసి ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల వృత్తి విద్య బోధకురాలు ఎం హేమలత బాలబాలికల చేత రాఖీల తయారీకి అవసరమైన చెంకీలు, పూసలు, సిల్క్ దారం మొదలైనవి సేకరించి అందమైన రాఖీలను వారిచే తయారు చేయించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్లతో రాఖీలు కట్టించి హెచ్‌ఎం బాచిన చలపతి రక్షాబంధన్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత


విద్యార్థినులకు స్కాలర్‌షిప్ అందజేస్తున్న మేనేజర్ వెంకటరెడ్డి

ఇంకొల్లు (చినగంజాం): విద్యార్థినుల విద్యాభివృద్ధికి అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకొని చదువులో బాగా రాణించాలని కెనరా బ్యాంకు మేనేజర్ పీ వెంకటరెడ్డి అన్నారు. శనివారం ఇడుపులుపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాలలో కెనరా బ్యాంక్ సామాజిక సేవలో భాగంగా పాఠశాలలోని షెడ్యూల్ కులాల ఆడపిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందించారు. ఇందులో బాగంగా ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు గతేడాది పరీక్షలలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థినులకు డాక్టర్ అంబేడ్కర్ విద్యాజ్యోతి స్కాలర్‌షిప్ పథకం ద్వారా పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పిడవర్తి పేరిరెడ్డి, సిబ్బందితో పాటు గ్రామ పెద్దలు పేర్నిబాబయ్య, గ్రామ సర్పంచ్ బండారు సుమతి పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల వితరణ


పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న దాతలు

పర్చూరు (చినగంజాం): ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థులకు పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ల్యాప్‌టాప్‌లను అందించినట్లు క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ తెలిపారు. కొల్లా సాకేత్ పుట్టిన రోజును పురస్కరించుకొని అతని తండ్రి శ్రీనివాసరావు, తాత సుబ్బారావులు హెచ్‌పీ కంపెనీకి చెందిన సుమారు రూ 1.14 లక్షల విలువ కలిగిన రెండు లాప్‌ట్యాప్‌లను ఒంగోలు క్విస్ కాలేజీలో చదువుతున్న రావినూతల భువనచంద్ర, వడ్లమూడి విజ్ఞాన్ లారా కాలేజీ విద్యార్థిని పిల్లుట్ల సాయి సంజనలకు స్వయంగా అందించినట్లు తెలిపారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు పంబి సదానందరెడ్డి, మున్నంగి వెంకట సుబ్బయ్య, నాగభైరు శ్రీనివాసరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, ధూళిపల్లి సత్యనారాయణ, కారుమూడి సుబ్బారెడ్డి, కాసాల అశోక్ కుమార్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

వేటపాలెం: స్థానిక సర్వోదయ కాలనీలో జీడి పప్పు ఫ్యాక్టరీల వద్ద పేకాట శిబిరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 2,300 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో సింగిల్ జూదం నిర్వహిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి, రూ. 1970 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

చినగంజాం: మండలంలోని మున్నంవారిపాలెం పంచాయతీ పరిధిలోని ఎంఎస్‌ఆర్ జూనియర్ కాలేజీ సమీపంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌ఓ సీతారెడ్డి తెలిపారు.

అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష


ఉద్యోగులతో సమీక్ష చేస్తున్న ఎంపీడీవో రామాంజినేయులు

జే.పంగులూరు: మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై, సర్వేలపై ఎంపీడీవో రామాంజినేయులు ఉద్యోగులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశాడు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖలు ప్రజా సమస్యలు గుర్తించి అందుకు అనుగుణంగా పనిచేయాలని కోరారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని, ఎక్కడ అవినీతికి తావు లేకుండా పనిచేయాలన్నారు. ఉపాధి కూలీలు కూలీలు ఎవరు పనులు లేకుండా ఇబ్బందులు పడకూడదని కోరారు. ప్రభుత్వ పథకాలన్ని అర్హులైన ప్రజలకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని, ఎక్కడా విమర్శలు రాకుండా చూసుకోవాలని సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో మండల గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏపీవో తదితర ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు.

పాఠ్య ప్రణాళిక తప్పనిసరి


మాట్లాడుతున్న ఎంఈవో సుధాకర్

అద్దంకి: ప్రతి ఉపాధ్యాయుడు పాఠాలు చెప్పబోయే ముందు పాఠ్య ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని ఎంఈవో బీ సుధాకర్ అన్నారు. ఆయన శనివారం మండలంలోని ధర్మవరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను వారి స్థాయిల ఆధారంగా గ్రూపులుగా విభజించి, తెలుగు, గణితం బోధించాలని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ శ్రీనివాసులు, సీఆర్పీ శంకర్ పాల్గొన్నారు.